హైకోర్టు జడ్జిని కలిసిన డిఎస్‌పి

ప్రజాశక్తి - పాలకొండ

వంగర మండలంలో రుషింగి వద్ద హైకోర్టు జడ్జి గేదెల తుషారావును పాలకొండ డిఎస్‌పి ఎం.రాంబాబు, సిఐ చంద్రమౌళి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. డివిజన్‌లో శాంతిభద్రతల పరిస్థితులతో పాటు పలు అంశాలపై కూలంకషంగా చర్చించారు.

హైకోర్టు జడ్జికి పూలమొక్కను అందజేస్తున్న డిఎస్‌పి

ప్రభుత్వ విద్యకే పెద్దపీట వేస్తున్నామన్న పాలకుల ప్రకటనలు ఆచరణకొచ్చే సరికి గడప దాటడం లేదు. పాఠశాలలకు నిర్వహణ నిధులను మూడేళ్లుగా ఇవ్వక పోవడమే అందుకు నిదర్శనం. ప్రతి ఏటా విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విడుదల చేయాల్సిన స్కూల్ గ్రాంట్స్‌ను విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఉన్నతాధికారులు మూడేళ్లుగా విడుదల చేయడం లేదు. దీంతో ప్రధానోపాధ్యాయులు సొంత డబ్బుతోనే పాఠశాలలకు కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు.

- విడుదల కాని పాఠశాల నిధులు
- హెచ్‌ఎంలకు తప్పని అవస్థలు
- మూడేళ్లుగా ఎదురుచూపులు

సుద్దముక్కలకూ నిధుల్లేవ్

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం జిల్లాలో 1594 పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వం విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిర్వహణకు నిధులు విడుదల చేస్తుంది. అందులో 30 మంది వరకు విద్యార్థులుంటే రూ.10 వేలు, 31 నుంచి 100 మంది ఉంటే రూ.25 వేలు, 101 నుంచి 250 మంది ఉంటే రూ.50 వేలు, 251 నుంచి వెయ్యి మంది ఉంటే రూ.75 వేలు, వెయ్యి మందికిపైగా విద్యార్థులు ఉంటే రూ.లక్ష చొప్పున ఏటా విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యాశాఖలోని సమగ్రశిక్ష ద్వారా పాఠశాలలకు నిధులు విడుదల చేసేది. ఈ నిధులతోనే ప్రధానోపాధ్యాయులు పాఠశాలల్లో ఏదైనా మరమ్మతులు చేయించుకోవడం, కరెంట్ బిల్లులు చెల్లించడం, సుద్దముక్కలు, డస్టర్లు, వైట్ పేపర్లు, చార్టులు, టీచింగ్ ఉపకరణాలు, మరుగుదొడ్ల శుభ్రం చేయడానికి కావాల్సిన సామగ్రి కొనుగోలు చేయాలి. కానీ 2022-23 విద్యా సంవత్సరం నుంచి మూడేళ్లపాటు స్కూల్ గ్రాంట్‌ను విడుదల చేయలేదని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. దీంతో ప్రధానోపాధ్యాయులు సొంత డబ్బుతో పాఠశాలలకు కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు. పాఠశాలలకు సంబంధించిన కరెంట్ బిల్లులను చెల్లించకూడదని గత విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. కానీ అందుకు ఎలాంటి ఉత్తర్వులూ జారీ చేయకపోవడంతో విద్యుత్తు శాఖ సిబ్బంది ప్రతి నెలా పాఠశాలలకు వచ్చి కరెంట్ బిల్లు తీసి, చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని పలువురు ప్రధానోపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిఇఒ, ఎపిసి, డివైఇఒ, ఎంఇఒలు పాఠశాలల తనిఖీలకు వచ్చినప్పుడు.. 'ఫ్యాన్లు, లైట్లు ఎందుకు పనిచేయడం లేదు. చిన్న చిన్న మరమ్మతులు ఎందుకు చేయించుకోవడం లేద'ంటూ తమను ప్రశ్నిస్తున్నారని వాపోతున్నారు. స్కూల్ గ్రాంట్ రావడం లేదని చెబితే ఏమాత్రమూ పట్టించుకోవడం లేదని చెబుతున్నారు.

ఇప్పటికైనా విద్యాశాఖ, సమగ్రశిక్ష ఉన్నతాధికారులు స్పందించి గత రెండేళ్ల బకాయిలతోపాటు ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠశాల నిధులు కూడా వెంటనే విడుదల చేయాలని, కరెంట్ బిల్లులు చెల్లింపులపైనా స్పష్టత ఇవ్వాలని ప్రధానోపాధ్యాయులు కోరుతున్నారు. ఈ సమస్య ఒక్క విజయనగరం జిల్లాలోనే కాదు... రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ వెంటాడుతోంది. దీనిపై విద్యాశాఖ, సమగ్రశిక్ష ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారన్నది వేచిచూడాల్సిందే.

మా జేబులో డబ్బులు ఖర్చు చేస్తున్నాం

పాఠశాలలకు స్కూల్ గ్రాంట్ రాక సొంత డబ్బులతోనే సామగ్రిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. పాఠశాలల్లో చిన్న చిన్న మరమ్మతులు కావాల్సిన మెటీరియల్, ఇతర టీచింగ్ సామగ్రిని ప్రధానోపాధ్యాయులు సొంత డబ్బుతో కొనుగోలు చేస్తున్నారు. మూడేళ్ల నుంచి ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో హెచ్‌ఎంలకు ఏడాదికి రూ.50వేలు నుంచి రూ.50వేలు వరకూ చేతి డబ్బులు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే పాఠశాలల నిర్వహణ బిల్లులు మంజూరు చేయాల్సిందిగా కోరుతున్నాం.

-టి.రమేష్,
యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు

గిట్టుబాటు ధర లభించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

మిల్లర్ల యజమానులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

జిల్లాలో రైతులు పండించిన ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అందులో 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు అనుమతించినట్లు చెప్పారు. ధాన్యం సేకరణలో ముందస్తు ఏర్పాట్లపై జిల్లాస్థాయి ధాన్యం సేకరణ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన గురువారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలు అశుతోశ్‌శ్రీవాస్తవ, యశ్వంత్ కుమార్‌రెడ్డితో కలిసి ధాన్యం సేకరణపై రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం సేకరణలో రైతులకు మంచి గిట్టుబాటు ధర లభించేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియలో అధికారులంతా సమన్వయం చేసుకుంటూ విజయవంతంగా పూర్తిచేయాలని తెలిపారు. ధాన్యం సేకరణలో ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తరాదని స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన గన్నీ సంచులు, రవాణా ఏర్పాట్లు, కొనుగోలు ప్రక్రియకు అవసరమైన పరికరాలు అన్ని సిద్ధం చేసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు అనంతరం రైతులకు నగదు చెల్లించేందుకు వీలుగా ఖచ్చితత్వంతో కూడిన బ్యాంకు ఖాతాలను రైతుల నుంచి ముందుగా పొందాలని వివరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించినా ఊరుకోబోమని, మిల్లర్లకు సహకరిస్తామని, అలాగే మిల్లర్లు కూడా రైతులకు సహకరించాలని రైస్ మిల్లర్ల యజమానులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్, పౌర సరఫరాల మేనేజర్, ఇన్‌ఛార్జ్ జిల్లా సరఫరాల అధికారి శ్రీనివాసులు, ఆర్‌టిఒ ఎం.శశికుమార్, డిసిఒ పి.శ్రీరామ్మూర్తి, జిసిసి డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్, సీతంపేట బ్రాంచి జిసిసి మేనేజర్ కృష్ణ మిలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, మిల్లర్ల యజమానులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

15లోగా దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక కెజిబివిలో నాన్‌టీచింగ్ అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన కుక్ పోస్టుకు సంబంధించి ఈనెల 15లోగా ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి ఆర్.ఆనందరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెలకు కనీస వేతనం రూ.15వేలు ఉంటుందని, ఏడాది ప్రాతిపదికన పనిచేయాలని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఆరోజున సాయంత్రం 5గంటల్లోపు ఎంఇఒ కార్యాలయానికి అందజేయాలన్నారు. దరఖాస్తులను డిఇఒకు పంపాలని, సమగ్ర శిక్ష ఎపిసి కమిటీ వారు ఎంపిక చేస్తారని తెలిపారు. స్థానికని తప్పితే మండల పరిధి ప్రాధాన్యత ఉంటుందని ఆయన తెలిపారు.

శిక్షణలో మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒసత్యనారాయణ

చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి -సీతానగరం

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలతో పాటు చట్టాలపై అవగాహన ఉండాలని జెడ్‌పి సిఇఒ బి.సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వార్డు సభ్యుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అక్షరాస్య పెంచుకోవాలని, గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు వేసుకోవాలని అన్నారు. వార్డు మెంబర్ల విధులు, హక్కులపై అవగాహన కలిగించుకోవాలన్నారు. దీంతోనే గ్రామాలు, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.త్రి త్రివిక్రమారావు, శిక్షకులు బి.మనోహర్, జి.శ్రీనివాసరావు, ఎ.శశిభూషణరావు వివిధ గ్రామాలకు చెందిన వార్డు సభ్యులు, ఉప సర్పంచులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు గత రెండు రోజులుగా పొందిన శిక్షణా తరగతులపై అవగాహన పెంచుకొని స్థానిక సంస్థల్లో పాలనకు సంబంధించి తనదైన మార్కును చూపించాలని జిల్లా పరిషత్ సిఇఒ సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గల మండల సమావేశ భవనంలో గత రెండు రోజులుగా స్థానిక సంస్థలకు చెందిన ఉప సర్పంచ్లు, వార్డు మెంబర్లకు పలు అంశాలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థలు ఆర్థిక సంఘం నిధులను సద్వినియోగం చేసుకొని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.రూపేష్, ఎఒ జి వెంకటరమణమూర్తి, సిఆర్పి జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలను ఆదుకుంటాం : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మరణించిన పోలీసు సిబ్బంది కుటుంబాలను, రిటైర్డ్ పోలీసు సిబ్బంది, హోం గార్డ్‌లకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని ఎస్‌పి ఎస్‌వి మాధవ్‌రెడ్డి అన్నారు. పోలీస్ సంక్షేమంలో భాగంగా జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహించి, ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ ఉద్యోగులు, దివంగత పోలీస్ ఉద్యోగుల కుటుంబ సభ్యులు, హోంగార్డుల కుటుంబ సభ్యులతో తన కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రతి ఒక్క సిబ్బంది, పోలీస్ కుటుంబ సభ్యులతో ఎస్పీ మాట్లాడి వారి వ్యక్తిగత, ప్రభుత్వం నుంచి ఇంకా రావాల్సిన బకాయిలు, వారికి అందాల్సిన లబ్ధి, యోగక్షేమాలు, ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి చెందాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్, ప్రభుత్వం నుండి రావాల్సిన భద్రత, జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ, విడో ఫండ్, కార్పస్/అడిసినల్ ఫండ్, జిఐఎస్, లీవ్ ఎన్‌కాష్‌మెంట్ నగదు వంటి రాయితీలు సకాలంలో అందినదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. అందని పక్షంలో త్వరితగతిన అందేలా చూస్తామని, వారి పెండింగ్ ఫైల్స్ గురించి అడిగి తెలుసుకొని వాటిని త్వరగా పూర్తి చేసేందుకు సంబంధిత డిపిఒ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రిటైర్డ్ పోలీస్ సిబ్బందికి వారి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి పలు సలహాలు సూచించారు. పోలీసు శాఖలో అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. విధినిర్వహణలో మరణించిన సిబ్బంది కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని, సర్వీస్ లేకపోయినా మనమంతా పోలీస్ కుటుంబమేనని, మీకు ఎల్లవేళలా జిల్లా పోలీసులు బాసటగా ఉంటారని ఎస్పీ భరోసా ఇచ్చారు. సుదీర్ఘ కాలం పాటు ప్రజాసేవకై అంకితమై ఉద్యోగ నిర్వహణ చేసి రిటైర్మెంట్ పొందిన సిబ్బందిని, వారి కుటుంబ సభ్యులను కలుసుకోవడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. వారి సేవలను పోలీసు వ్యవస్థ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందన్నారు. ప్రభుత్వం తరుపున రావాల్సిన ప్రయోజనాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటున్నామని, పోలీస్ కుటుంబ సభ్యులకు ఏ సమస్య వచ్చినా తనను నేరుగా కలవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాల వల్ల మరణించిన సిబ్బంది పి.శ్రీనివాసరావు భార్య పి.రజినికుమారికి విడో ఫండ్ రూ.50వేలు చెక్కు అందజేశారు. సమావేశం అనంతరం మరణించిన పోలీసు సిబ్బంది కుటుంబాలు, రిటైర్డ్ పోలీసు సిబ్బందికి భోజనాలు ఏర్పాటు చేసి స్వయంగా బోజనం వడ్డించారు. కార్యక్రమంలో ఎస్బీ సిఐ జిడి బాబు, ఎఆర్ ఆర్‌ఐలు శ్రీరాములు, శ్రీనివాసరావు, టి.శ్రీనివాసరావు, డిపిఒ, ఎఒ జె.త్రినాధ, సత్యం, ఎ-సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు, సిబ్బంది, మరణించిన పోలీసు సిబ్బంది కుటుంబాలు, రిటైర్డ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మాధవరెడ్డి

15న సాలూరులో మినీ జాబ్ మేళా

ప్రజాశక్తి-సాలూరు

ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా ఈనెల 15న సాలూరులో మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, ఏదైనా డిగ్రీ చదువుకొని 18 నుంచి 25 ఏళ్లలోపు గల నిరుద్యోగ యువతీ యువకులు ఈనెల 15న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరగనున్న మినీ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని చెప్పారు. ఆ రోజు ఉదయం 9గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందని, కావున ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను https://skilluniverse.apssdc.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్‌తో పాటు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జెరాక్స్, ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫోటోతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 73825 59022, 94947 77553 మొబైల్ నెంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు

తాత్కాలిక ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి -సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలో గల మెళియాపుట్టి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో మ్యాథ్స్, ఫిజిక్స్ తాత్కాలిక ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సీతంపేట ఐటిడిఎ గురుకులం సెల్‌కు లేదా పాతపట్నం వైటీసీలో నిర్వహిస్తున్న ఏకలవ్య పాఠశాలకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

వైటిసిని కేంద్ర బృందం పరిశీలన

ప్రజాశక్తి -సీతంపేట

స్కిల్ కాలేజ్ నేషనల్ లెవెల్ మానిటరింగ్ బృందం స్థానిక యూత ట్రైనింగ్ సెంటర్‌ను గురువారం సందర్శించారు. బృందం సభ్యులు నేరుగా అభ్యర్థుల భోజనం, శిక్షణ పరిశీలించారు. వసతి ఎలా ఉన్నాయని , ఎలాంటి స్కిల్ నేర్పుతున్నారని విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేంద్ర బృందం ప్రతినిధులు సశ్యపాన్, సలీమ్ కుమార్, శ్రీకాకుళం జేడియం రమణమూర్తి, ఎపిడి శ్రీహరి, వైటిసి మేనేజర్, వెంకటరమణ, స్కిల్ డెవలప్మెంట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఎన్నో ఏళ్లుగా ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో పోడు భూముల్లో వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్న గిరిజన రైతులకు సంబంధించిన భూములను సర్వే చేసి పట్టాలను ఇవ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో నిరసన కార్యక్రమం నిర్వహించి అనంతరం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా గిరిజనులు సాగుచేస్తున్న భూములకు అధికారులు సర్వే చేశారని, అయితే వాటికి సంబంధించిన పట్టాలను మాత్రం ఇప్పటికీ అందజేయలేదని అన్నారు. ముఖ్యంగా మండలంలోని బొర్రా పనుకువలస, జిల్లేడువలస గిరిజనులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని అనేకసార్లు రెవెన్యూ అధికారులను వేడుకుంటున్నా ఇప్పటివరకు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఆంధ్ర ఒడిస్సా సరిహద్దు ప్రాంతమైన గంజాయిభద్ర పంచాయతీలో సాగు చేస్తున్న భూములకు సర్వేలు నిర్వహించి అటవీ పట్టాలు ఇవ్వాలన్నారు. పట్టాలు లేక పోవడంతో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, పంట నష్టపరిహారం అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సర్వే చేసిన వారికి పూర్తిస్థాయిలో పట్టాలు ఇవ్వలేదని, అలాగే అనేక గ్రామాల్లో సర్వే కూడా చేయలేదన్నారు. గంజాయిభద్ర పంచాయతీలో కొటియా సరిహద్దు గ్రామాల్లో పూర్తిస్థాయిలో సర్వేలు చేయలేదని, ధూళిభద్రలో 50 మందికి పైగా లబ్ధిదారులకు పట్టాలు లేవన్నారు. దీనిపై గతంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో జిల్లేడువలస, బొర్రపనులు వలస గ్రామాల గిరిజనులు పోరాటం చేయగా, పట్టాలు పంపిణీ చేస్తామని అధికారులు హామీ ఇచ్చినా అమలు చేయలేదన్నారు. అలాగే పట్టాలు లేకుండా చేసిన అప్పటి విఆర్ఒ, తహశీల్దారుపై చర్యలు తీసుకుంటామని పై అధికారులు హామీ ఇచ్చినా నేటికీ ఆ హామీనీ అమలు చేయలేదు సరికదా పట్టాలిస్తామంటూ కాలయాపన చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పట్టాలు పంపిణీ చేయాలని, సర్వే కాని వారందరికీ సర్వేలు చేసి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు గెమ్మెల జానకిరావు, వంతల సుందరరావు, గెమ్మెల జిత్తు, పూలు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ధర్నా

తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

పండగ పూటా పప్పుకరువే!

ప్రజాశక్తి - కురుపాం

మార్కెట్లో నిత్యావసర ధరలు మండిపోతున్నా పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలు ప్రభుత్వం తీసుకోవడం లేదు. తెల్ల రేషన్ కార్డుదారులకు రాయితీపై అందించే కందిపప్పు గత ఎనిమిది నెలలుగా పూర్తిగా నిలిచిపోయింది. పంచదార సైతం చాలా చోట్ల సక్రమంగా పంపిణీ కావడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా కందిపప్పు సరఫరా నిలిచిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగిపోవడంతో సామాన్యులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు.

అక్టోబర్‌కు సంబంధించి కందిపప్పు సరఫరా నేటికీ కాలేదు. గత 8నెలల సరుకు అందుతుందని కార్డుదారులు ఎదురుచూశారు. కానీ అక్టోబర్‌లో ఒకటి నుంచి పేదలకు అందించే రేషన్ సరకుల్లో కందిపప్పు లేదని అధికారులే చెబుతున్నారు. దీంతో పేదలు దసరా పండుగ నాడు కూడా పప్పు బువ్వకు కూడా నోచుకోక గెంజినీళ్లతో కాలం గడపాల్సి వస్తుందని కంటనీరు పెడుతున్నారు. అసలే కూరగాయలు, నిత్యావసరాల ధరలు ఆకాశానంటుతున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజలు జీవనం సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం రాయితీపై అందించే సరకుల కోసం ఆశతో ఎదురుచూస్తున్న లబ్దిదారులకు నిరాశే మిగులుతోంది. దీనికి తోడు ప్రభుత్వం పేదలకు అందాల్సిన సరుకుల్లో ఒక్కొక్కటిగా తగ్గిస్తోంది.

8 నెలలుగా రేషన్‌లో కందిపప్పు దూరం

8నెలలుగా కందిపప్పు పంపిణీ చేయలేదు. ఈనెలలో కూడా ఇవ్వడం లేదు. కార్డుదారులకు బియ్యం, పంచదార మాత్రమే వంపిణీ చేస్తున్నారు.

మండలంలో 11 ఎండియు వాహనాలున్నాయి. వీటి పరిధిలో 14360 (కొత్త కార్డులతో కలిపి) బియ్యం కార్డులున్నాయి. ఆయా కుటుంబాలకు ప్రతినెలా బియ్యంతో పాటు అర కిలో పంచదార, కిలో కందిపప్పును ప్రభుత్వం రాయితీపై అందించాల్సి ఉంది. ప్రతినెలా కందిపప్పు పంపిణీ చేయాల్సి ఉంది. రాయితీపై ప్రతి కార్డుకు రూ.67 చొప్పున అందించేది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో దీని ధర రకాన్ని బట్టి రూ.130 నుంచి రూ.200 వరకు ఉంది. ఎనిమిది నెలల నుంచి కందిపప్పు సరఫరా చేయడం లేదు. కనీసం పండగ సమయంలోనైనా కందిపప్పు సరఫరా చేస్తే పప్పుచారుతోనైనా తింటామని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బయట కొనలేకపోతున్నాం

రేషన్ షాపుల్లో రూ.67కు కేజీ కందిపప్పు సరఫరా చేసేవారు. ప్రస్తుతం సరఫరా నిలిపివేయడంతో కందిపప్పు ధర బయట మార్కెట్లో రూ.160 నుంచి రూ.180 వరకు పలుకుతోంది. అసలే పనుల్లేక ఇబ్బందులు పడుతున్న పేదలు అంత ధర పెట్టి కందిపప్పు కొనుగోలు చేయడం కష్టంగా మారుతోంది.

బి. వెంకటరావు,
మామిడిమానుగూడ.

పప్పును మరిచిపోయాం

గతంలో కందిపప్పు పంపిణీ చేసేవారు. దీంతో వారంలో రెండు రోజులైనా పప్పుచారు చేసుకునేటోళ్లం. తీరా ఎనిమిది నెలల నుంచి కందిపప్పు పంపిణీ చేయడం ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో పప్పుచారు చేసుకోవడమే మానుకున్నాం.

- ఎం.అడ్డమేశ్వరరావు,
వబ్బంగి గ్రామం

ప్రభుత్వం నుంచి వస్తే పంపిణీ చేస్తాం

ప్రభుత్వం నుంచి కందిపప్పు సరఫరా లేదు. వస్తే కార్డుదారులకు పంపిణీ చేస్తాం.. ప్రస్తుతానికి అంగన్వాడీ కేంద్రాలకు మాత్రమే సరఫరా వచ్చింది. బియ్యంతో పాటు, పంచదార పంపిణీ చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి కందిపప్పు వచ్చిన వెంటనే లబ్దిదారులకు అందిస్తాం..

- మండల పౌరసరఫరా అధికారులు

రాయగడ ఎమ్మెల్యేను అభినందిస్తున్న కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి

రాయగడ ఎమ్మెల్యేను కలిసిన కురుపాం ఎమ్మెల్యే

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

ఒడిశాలోని రాయగడ స్థానిక ఎమ్మెల్యే కడ్రక అప్పలస్వామిని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆంధ్ర - ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఉన్న రహదారుల కల్వరుకు, జంఝావతి రబ్బర్ డ్యాం గురించి ఇద్దరు చర్చించారు. వీటన్నింటిపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి పనులు పూర్తయ్యేలా కృషి చేస్తానని అప్పలస్వామి తెలిపారు. అనంతరం ఇద్దరు కూడా సోదరి సోదర భావంతో ముందుకు వెళ్తూ ఏ సమస్య ఉన్నా కూర్చుని చర్చించుకుని పరిష్కరించుకునేలా చేద్దామని అన్నారు.

మాలతమ్మ సంబరాల్లో ఎమ్మెల్యే

దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం గుమ్మలక్ష్మీపురంలో మాలతమ్మ సంబరాలను, ఘటాల ఊరేగింపును కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కిషోర్, గ్రామ పెద్దలు, మహిళలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఫర్నిచర్ మాయంపై విచారణ

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మున్సిపాలిటీలోని పారిశుధ్య విభాగం గదిలో ఉన్న విలువైన ఫర్నిచర్ మాయంపై విచారణ జరిపిస్తామని మున్సిపల్ కమిషనర్ విహెచ్.సత్యనారాయణ చెప్పారు. బుధవారం మున్సిపల్ కార్మికులే స్వయంగా ఫర్నిచర్ వ్యవహారంపై ఫిర్యాదు చేయడంతో విచారణ నిర్వహిస్తామని తెలిపారు. పారిశుధ్య విభాగం గదిలో ఉన్న ఫర్నిచర్ మాయం కావడానికి సంబంధించి అధికారి బాధ్యత వహించాల్సిందేనని చెప్పారు. మున్సిపల్ ఆర్వో ప్రసాదరావుతో విచారణ జరిపిస్తామని మున్సిపల్ కమిషనర్ 'ప్రజాశక్తి'కి తెలిపారు.

శివశంకర్‌ను సన్మానిస్తున్న జర్జాపు సోదరులు

శివశంకర్‌ను కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి - సాలూరు

జనసేన ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్‌ను స్థానిక నియోజకవర్గ జనసేన నాయకులు జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఎంఎస్ఎంఇ డిసి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన్ను జర్జాపు సోదరులు అభినందించారు. శివశంకర్‌ను కలిసిన వారిలో జిల్లా నాయకులు పెంట తిరుపతిరావు, ఎ.మోహన్‌రావు ఉన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపిడిఒకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న టిడిపి నాయకులు

ఎంపిడిఒకు టిడిపి నాయకులు అభినందనలు

ప్రజాశక్తి - పాచిపెంట

స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బివిజె పాత్రో గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపిడిఒగా పనిచేసిన పి.లక్ష్మీకాంత్ చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్లడంతో ఆ స్థానంలో ఇక్కడ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేస్తున్న పాత్రో ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం మండల టిడిపి నాయకులైన పాంచాలి సర్పంచ్ గూడెపు యుగంధర్. పూసర్ల నర్సింగరావు, ఎంపిటిసి సభ్యులు పల్లేడ ఉమామహేశ్వరరావు, కె.సురేష్ ఎంపిడిఒకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

యోగా కోర్సులకు 21లోగా దరఖాస్తు

ప్రజాశక్తి - సాలూరు

ఆంధ్రా యూనివర్సిటీ సహకారంతో అమృత ట్రస్ట్ ఆధ్వర్యాన అందించబోయే ఆరు నెలల యోగా డిప్లొమా, ఏడాది పిజి డిప్లొమా కోర్సులకు ఈనెల 21లోగా దరఖాస్తు చేసుకోవచ్చునని ట్రస్ట్ అధ్యక్షులు ఎ.ఇందుమణి ఒక ప్రకటనలో తెలిపారు. డైరెక్టర్, ఆంధ్రా యూనివర్సిటీ పేరిట తీసిన రూ.500 డిడిని దరఖాస్తుతో పాటు సమర్పించాలని చెప్పారు. మన్యం జిల్లాలో ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. తీవ్రఒత్తిడితో సతమతమవుతున్న వ్యక్తులకు యోగా చాలా అవసరమని చెప్పారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు నిర్ణీత గడువులోగా ఆంధ్రా యూనివర్సిటీ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని ట్రస్ట్ చైర్ పర్సన్ ఇందుమణి ఆ ప్రకటనలో కోరారు.

పోలమాంబకు పంచామృతాభిషేకం

ప్రజాశక్తి - మక్కువ

ఉత్తరాంధ్ర ఆరాధ్య దేవత పోలమాంబ అమ్మవారికి గురువారం పంచామతాభిషేకం చేశారు. దసరా మహోత్సవాల్లో భాగంగా దుర్గాదేవి రూపంలో అలంకరణ చేశారు. ఆయ ఇఒ వివి సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

సూర్యపీఠంలో చండీహోమం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ శివారులో గల శ్రీ సూర్యపీఠంలో గురువారం మహాష్టమి సందర్భంగా ఆశేష శేముషి నిధి బ్రహ్మశ్రీ వేమకోటి నరహరి శాస్త్రి ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదిత్య పంచాయతన క్షీరాభిషేకం, సౌర అరుణ పారాయణాలు, నవదుర్గా పూజ నిర్వహించారు. విశ్వశాంతి మంత్ర హోమం లోక కళ్యాణార్థం, సకాల వర్ష ప్రాప్తికి ప్రజల ఆరోగ్య సిద్ధికి ప్రపంచమందు నేడు నెలకొన్న యుద్ధ భీతి నివారణకై, ప్రజల శాంతిమయ జీవనానికై పై కార్యక్రమం నిర్వహించామని నరహరి శాస్త్రి తెలిపారు. యాగ పూర్ణాహుతి అనంతరం నారాయణ సేవ చేశారు. కార్యక్రమంలో వేమకోటి వివేకానంద్, టిఆర్ కృష్ణశర్మ తదితరుల వైదిక సహకారం అందించారు.

హోమం చేస్తున్న నరహరి శాస్త్రి

ధాన్యం కొనుగోళ్లపై శిక్షణ

ప్రజాశక్తి -బలిజిపేట

ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండలంలోని పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులకు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు, టెక్నికల్ అసిస్టెంట్లకు స్థానిక రైతు సేవా కేంద్రంలో సాంకేతిక శిక్షణా తరగతులు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధాన్యం కొనుగోలులో తేమ -17శాతం, సేంద్రియ అసేంద్రియ వ్యర్థ పదార్థాలు - ఒకశాతం, దెబ్బతిన్న, రంగుమారిన, మొలకెత్తిన, పురుగు బట్టిన ధాన్యం-శాతం, పరిపక్వం గాని, కుచించుకుపోయిన, మెలితిరిగిన ధాన్యం- 3శాతం, తక్కువ శ్రేణి లేదా కెలీలు 6శాతం, నాణ్యతా ప్రమాణాలు అవసరమని టెక్నికల్ అసిస్టెంట్లు అవగాహన కల్పించారు. అలాగే సాధారణ రకం క్వింటాల్ రూ.2300, ఎ-గ్రేడ్ క్వింటాల్ రూ .2320గా కొనుగోలు కేంద్రంలో ఉన్న విఎఎలు రైతులకు షెడ్యూల్ ఇవ్వనున్నట్టు తెలిపారు. తదుపరి టెక్నికల్ అసిస్టెంట్ రైతు తెచ్చిన ధాన్యం నాణ్యతా ప్రమాణాలు పరిశీలిస్తారని, డేటా ఎంట్రీ ఆపరేటర్ కేంద్రంలో జరుగుతున్న ప్రక్రియను ఎంట్రీ చేయడం జరుగుతుందని తెఇపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రావణ్, విఎఎలు, టెక్నికల్ అసిస్టెంట్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

సీతానగరం : ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసినప్పుడు తేమశాతాన్ని మనం గమనంలో ఉంచుకోవాలన్నారు. పంట కోత ప్రయోగంలో వచ్చే దిగుబడిని బట్టి వారి కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలులో కంప్యూటర్ డేటా ఆపరేటర్లు, విఎఎలు తప్పక నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల విఎఎలు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ ఏరియాలోని మద్యం షాపుల్లో గిరిజనులకే ప్రాధాన్యత

ప్రజాశక్తి - పార్వతీపురం

షెడ్యూల్డ్ ఏరియా మండలాల్లోని మద్యం షాపుల్లో స్థానిక గిరిజనులకే ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్ కిశోర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన జారీచేశారు. నూతన మద్యం పాలసీ విధానంలో భాగంగా షెడ్యూల్డ్ ఏరియాలోని మద్యం షాపులకు ప్రభుత్వం విధి విధానాలను, మార్గదర్శకాలను జారీచేసిందని చెప్పారు. గ్రామాలన్నీ షెడ్యూల్డ్ ఏరియా కింద నోటిఫై చేయబడిన మండలాల్లోని షాపులకు స్థానిక గిరిజనులు మాత్రమే అర్హులన్నారు. ఒకవేళ స్థానిక గిరిజనులు దరఖాస్తు చేయకపోతే స్థానికేతర గిరిజనులకు అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. మండలంలో కొన్ని గ్రామాలు షెడ్యూల్డ్ ఏరియా కింద నోటిఫై చేయబడి, మిగతా గ్రామాలు మైదాన ప్రాంతానికి చెంది ఉన్నట్లయితే అట్టి మండలంలోని షాపు గిరిజనేతర వ్యక్తికి లాటరీలో కేటాయించబడినట్లయితే ఆ వ్యక్తి తన షాపును మైదాన ప్రాంతంలో మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఒకవేళ గిరిజన వ్యక్తికి లాటరీలో షాపు కేటాయించబడితే అతను తనకు నచ్చిన చోట షాపును ఏర్పాటు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. అలాగే షెడ్యూల్ ఏరియాకు చెందిన గ్రామాల్లో షాపును ఏర్పాటు చేసేందుకు సంబంధిత గ్రామసభ తీర్మానం తప్పనిసరి అని తేల్చి చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించిన షెడ్యూల్ ప్రాంతాలకు చెందిన గిరిజనులు స్థానిక ఎస్‌టి సర్టిఫికేట్, ఎంట్రీ పాసులతో ఈనెల 14న ఎంఎ నాయుడు కన్వెన్షన్ హాల్‌కు తప్పక హాజరుకావాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కురుపాం :స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో కొత్తగా మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఇందులో భాగంగా గుమ్మలక్ష్మీపురంలో రెండు మద్యం దుకాణాలకు గానూ స్థానికంగా ఉండే షెడ్యూలు కులస్తులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సిఐ శేఖర్ బాబు, ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ముఖ్యంగా స్టేషన్ లో కాకుండా కొంతమంది ఆన్లైన్‌లో కూడా దరకాస్తులు ఇతర కులస్తులు వారు కూడా చేస్తున్నారని, వారు ఈ విషయం గమనించాలని అన్నారు. అలాగే ఈనెల 14న జరిగే దుకాణాల ఎంపికకు వచ్చిన దరకాస్తుదారులు తప్పని సరిగా వారి కులధ్రువీకరణ పత్రం, స్థానిక ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని అన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

ప్రజాశక్తి - సీతంపేట

నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, వెంటనే ప్రభుత్వం స్పందించి ధరల పెంపునకు కళ్లెం వేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర సభ్యులు ఎం.తిరుపతిరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిత్యావసరాలైన నూనె, పప్పులు, కూరగాయలు, వెల్లులి వంటి వస్తువులు సామాన్య, మధ్యతరగతి ప్రజలు కొనలేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం పేరుకే ప్రజా పంపిణీ వ్యవస్థ నడుపుతుందని, బియ్యం తప్ప ఇతర వస్తువులు ఇచ్చిన పరిస్థితి లేదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్కెట్‌ను పూర్తిగా వ్యాపార వర్గాలకు విడిచి పెట్టి చోద్యం చూస్తున్నాయని విమర్శించారు. మరో పక్క రాష్ట్ర ప్రభుత్వం మద్యం ధరలు తగ్గించి, సూపర్ సిక్స్ అమలు చేయకుండా మాది మంచి ప్రభుత్వమని ప్రచారం చేసుకుంటుందని విమర్శించారు. ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేసి ప్రజల నుంచి మంచి ప్రభుత్వమనిపించు కోవాలి గానీ, తనకు తాను ప్రచారం చేసుకోవడం ఉపయోగం ఉండదని విమర్శించారు.

చిట్టిపూడి వలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిట్టిపూడివలసలో గురువారం స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరపీడితులు, మధుమేహం, రక్త పోటు, తదితర రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం జి.పైడితల్లి, ఎంఎల్‌హెచ్‌పి వై.పవిత్ర, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు, పాల్గొన్నారు.

స్వచ్ఛమైన స్నేహానికి తారతమ్యాలు ఉండవు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్వచ్ఛమైన స్నేహానికి కుల, మత తారతమ్య బేధాలుండవని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర అన్నారు. జిల్లా కేంద్రంలో పట్టణంలో ఉన్న సాయిష్ ప్యాలెస్ ఫంక్షన్ హాలులో గురువారం స్థానిక ఎమ్మెల్యే విజయ్‌చంద్రతో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా తనతో కలిసి చదువుకున్న స్నేహితులంతా ఒకచోటకు చేరి ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చిన్నతనం నుంచి ఎంతో నిబద్ధతతో అకుంఠిత దీక్షతో అనుకున్న పని సాధించేందుకు పనిచేసిన మిత్రులు విజయ్‌చంద్ర అదే నేడు నాయకునిగా నిలబెట్టిందని అన్నారు. జీవితంలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వారు కొనియాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యక్తి ఉన్నత స్థితికి చేరుకునేందుకు, రాచ మార్గం వేసు కునేందుకు స్వచ్ఛమైన స్నేహం ఉపయోగ పడుతుందని అన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యేకు వినతులు

పార్వతీపురం రూరల్ : స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర గురువారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బారు కార్యక్రమానికి పరిసర గ్రామాల నుంచి సమస్యల పరిష్కారం కోరుతూ పలువురు వినతులు సమర్పించారు. ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ నియోజవర్గానికి చెందిన మహిళలు దరఖాస్తులు సమర్పించగా, భూ సంబంధిత తగాదాలను పరిష్కరించాలని కోరుతూ పలువురు వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దరఖాస్తులను సంబంధిత అధికారులకు పంపిస్తున్నానని, ఆయా శాఖల అధికారులు స్పందించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని అని కోరారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బార్నాల సీతారాం, గరిమెళ్ల భానుప్రసాద్, జి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితులతో ఎమ్మెల్యే విజయచంద్ర

నేటితో దరఖాస్తులకు ఆఖరు

ప్రజాశక్తి - సాలూరురూరల్

మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసుకొనే సమయం శుక్రవారం సాయంత్రం 7 గంటలకు ముగిస్తుందని సాలూరు ఎక్సైజ్ సిఐ గుల్లిపల్లి దాసు తెలిపారు. రాష్ట్రంలో మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసుకొనేవారికి తొలుత బుధవారం సాయంత్రం 5 గంటల వరకు సమయం ఇచ్చారని, కానీ పలువురి దరఖాస్తుదారుల విజ్ఞప్తితో రాష్ట్ర ప్రభుత్వం ఈ గడువును శుక్రవారం సాయంత్రం 7 గంటల వరకు పెచ్చినట్లు తెలిపారు. షాప్‌నకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థి రూ.2లక్షలు నాన్ రెఫండ్బుల్ రుసుంతో ఏదైనా ప్రభుత్వ బ్యాంక్ ద్వారా ఎక్సైజ్ సూపరెండెండ్ పార్వతీపురం మన్యం జిల్లా పేరున డిడి తీయాలన్నారు. ఆ డిడిని సాలూరు ఎక్సైజ్ కార్యాలయంలో అప్లికేషన్‌తో పాటు అందజేసి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇప్పటి వరకు సాలూరు ఎక్సైజ్ మున్సిపాలిటీలో 5 మద్యం దుకాణాలకు 55 దరఖాస్తులు వచ్చాయన్నారు. సాలూరు మండలం నుంచి 34, పాచిపెంటలో మూడు షాప్‌లకు 66, మక్కువ మూడు షాపులకు 102, సాలూరులో 257 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

దళిత, గిరిజనుల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి -వీరఘట్టం

దళిత, గిరిజనుల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పాలకొండ, రాజం ఎమ్మెల్యేలు నిమ్మక జయకృష్ణ, కొండ్రు మురళీమోహన్‌రావు అన్నారు. గురువారం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో ఏర్పాటు చేసిన అభినంద సభకు ముఖ్యఅతిథితులుగా పాల్గొని మాట్లాడారు. దళిత గిరిజనుల సమస్యలు పరిష్కారానికి నిరంతరం పనిచేస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యేలకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దళిత ఉద్యోగ ఉపాధ్యాయ, ప్రజా సంఘాల జెఎసి నాయకులు పి.దుర్గారావు, రాష్ట్ర మీడియా కన్వీనర్ అన్ను వెంకటరావు, ఎ.ప్రతాప్, ఎన్.భరత్‌భూషణరాజ్, బి.నారాయణరావు, గంజి యజ్ఞ, డి.రాంబాబు, ఎ.తవిట్రాస్, పి.శ్రీనివాసరావు, జైభీమ్ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

వృత్తి విద్యా కోర్సులతో మెరుగైన ఉపాధి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

వృత్తి విద్యా కోర్సులతో మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చునని సమగ్ర శిక్ష జిసిడిఎ బోను శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పెదబొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఒకేషనల్ కోర్స్ విద్యార్థులకు ఫుడ్ ప్రాసెసింగ్ ట్రేడ్ ఇంటర్న్ల్ షిప్ కార్యక్రమంలో భాగంగా మైండ్ లీడర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో వారికి పది రోజుల పాటు శిక్షణ నిర్వహించారు. శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ఫుడ్ ఇండస్ట్రీ కంపెనీల్లో ఎక్కువ అవకాశాలు ఉన్నాయని, వీటిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలు కోర్సులను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఐ.గౌరి, బిసి జె.అప్పలనాయుడు, ఒకేషనల్ ట్రైనర్ ఎ.అనూష తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బట్టలు పంపిణీ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో గురువారం నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ నాయుడు తండ్రి జ్ఞాపకార్థంగా సుమారు 30మందికి పేదలకు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంజీవనాయుడు మాట్లాడుతూ ఏదో ఒక సందర్భంగా నిరుపేదలకు బట్టలు రూపం, ఆర్థికంగా సహాయ సహకారాలు అందుతున్నాయని, ఇంతవరకు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని, తన తండ్రి జ్ఞాపకార్థంగా బట్టలు పంపిణీ చేయడం తనకు ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంజీవనాయుడు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న సంజీవరావు దంపతులు

ఆవుదూడకు పండ్లు తినిపిస్తున్న రాజన్నదొర

దసరా పూజల్లో మాజీ డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు

మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర పట్టణంలోని సర్వమంగళ పీఠంలో గురువారం నిర్వహించిన దసరా నవరాత్రుల్లో భాగంగా పూజలు చేశారు. కుటుంబ సమేతంగా పీఠంలో పూజలు నిర్వహించారు. గోశాలలో వున్న గోవులకు పండ్లు తినిపించారు. పీఠాధిపతి కాళిదాసు శర్మ ఆధ్వర్యాన జరిగిన పూజల్లో ఆయన పాల్గొన్నారు.

వీరేష్ చంద్రదేవ్‌ను కలిసిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బాధ్యతలు స్వీకరించిన జె.ఉమామహేశ్వరి గురువారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్‌ను కురుపాంలో ఆయన కోట వద్దకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి మండలాన్ని అభివృద్ధి పర్చడానికి అన్ని విధాలా సలహాలు, సహాయ కార్యక్రమాలు అందించాలని ఆయన్ను కోరారు. అనంతరం మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చడానికి తీసుకోవాల్సిన భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికల గూర్చి చర్చించారు.

వీరేష్‌చంద్రదేవ్‌కు పూలమొక్కను అందజేస్తున్న ఎంపిడిఒ

సభ్యత్వాల నమోదుపై శిక్షణ

ప్రజాశక్తి - పాలకొండ

టిడిపి సభ్యత్వాల నమోదుపై టిడిపి నియోజకవర్గ ఇన్-ఛార్జ్ పడాల భూదేవి ఆధ్వర్యంలో పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి టెక్నికల్ సిబ్బందికి గురువారం స్థానిక కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంద రూపాయలు సభ్యత్వం చెల్లించి, రెండేళ్ల కాలపరిమితిలో ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు పరిహారం ఇవ్వనున్నట్టు తెలిపారు. సహజ మరణానికి రూ.30వేలు ఇన్సూరెన్స్ చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి సభ్యులు సామంతుల దామోదర్ రావు, అరకు పార్లమెంటరీ తెలుగు యువత అధ్యక్షులు వారాడ సుమంత్ నాయుడు, మండల టిడిపి ఉపాధ్యక్షులు పి. రమణ మూర్తి, టిడిపి పట్టణ పూర్వపు అధ్యక్షులు గుమ్మిడి సింహాద్రి, శాసపు సర్వారావు, తదితరులు ఉన్నారు.

కెజిబివి ప్రత్యేక అధికారిగా ఉషా రత్నకుమారి

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి) ప్రత్యేక అధికారిగా దాసరి ఉషారత్న కుమారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె జి.శిగడాం మండలం బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహించిన ప్రమీల జి.శిగడాం మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి ఉషా రత్నకుమారి మాట్లాడుతూ అందరి సహకారంతో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నేరాలు ఘోరాలు

మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

లోయలో లారీ బోల్తా.. ఒకరు మృతి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కోతాం భూమ్మిక ఘాట్ రోడ్డు లోయలో బిఎస్ఎన్ఎల్ లారీ లోయలో పడి కె.సతీష్ (33)అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కథనం ప్రకారం రాజమండ్రి నుండి సీతంపేట మండలం సారా గ్రామానికి బిఎస్ఎన్ఎల్ టవర్ సామాగ్రిని లారీలో తీసుకొని వెళ్తుండగా గురువారం బొమ్మిక - కోతాం ఘాట్ రోడ్డు వచ్చేసరికి బ్రేకులు ఫెయిలయ్యాయి. దీంతో లారీ లోయలో బోల్తా పడడంతో రాజమండ్రి జిల్లా రంగంపేట మండలం సుభద్ర పేట చెందిన కె.సతీష్ అక్కడికక్కడే మృతి చెందారు. మిగతా ఇద్దరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఎస్సై వై.అమ్మన్నరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

ప్రజాశక్తి - కురుపాం

గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఓ బాలిక చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై పి.నారాయణరావు తెలిపారు. ఎస్సై అందించిన సమాచారం మేరకు కురుపాం మేజర్ పంచాయతీకి చెందిన ఓ బాలిక తల్లిదండ్రులు సరిగ్గా చదువుకోవడం లేదని మందగించడంతో గత నెల 20న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను కురుపాం సిహెచ్‌సికి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం, అక్కడ నుంచి విజయనగరం, అక్కడనుండే విశాఖపట్నం కెజిహెచ్ తరలించిగా చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందింది. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పొలంబడిలో రైతుల రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి - పాచిపెంట

రైతులకు పొలంబడి కార్యక్రమంలో చోడి పంట మీద శిక్షణ ఇచ్చి 14 వారాల పాటు వివిధ పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించి రైతు తనంతట తానుగా నిర్ణయాలు తీసుకునే దిశగా చేయడమే పొలంబడి లక్ష్యమని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని పెదకొంచూరు, ఇప్పలవలస రైతులకు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. పొలంబడి రైతులను ముందుగా ఎఫ్‌పిఒతో రిజిస్ట్రేషన్ చేయించి తదుపరి ఎపి ఎస్ఒపిసిఎతో రిజిస్ట్రేషన్ చేయించి ఆన్లైన్ మార్కెటింగ్ ద్వారా ఎలాంటి పురుగు మందులు, అవశేషాలు లేని పంటలకు అధిక ధర కల్పించడమే అంతిమంగా పొలంబడి లక్ష్యమని అన్నారు. ఇందుకోసం రైతులకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ ఏజెన్సీ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించి రైతుల నమోదు పూర్తి చేసి వారి ఉత్పత్తులను పరీక్షలు చేసిన అనంతరం ఎలాంటి పురుగుమందుల అవశేషాలు లేనట్లయితే ఆయా రైతులకు సర్టిఫికెట్లు ఇవ్వబడతాయని తెలిపారు. అనంతరం చోడి పంటలో వచ్చే వివిధ పురుగుల, తెగుళ్లను పరిశీలించారు. అలాగే అధిక రసాయన ఎరువుల వల్ల వానపాములు ఎలా చనిపోతాయో చూపించారు.

కార్యక్రమంలో విఎఎ భారతి, కిరణ్, ప్రకృతి సేద్య సిబ్బంది సురేష్, విజయ్, శతాభి సర్పంచి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం పరిశీలన

రైతులు రసాయన, ప్రకృతి వ్యవసాయాలను సమ్మిళితం చేసుకుని వ్యవసాయాన్ని కొనసాగించినట్లయితే తక్కువ ఖర్చుతో ఆరోగ్యవంతమైన అధిక దిగుబడులు పొందవచ్చని విజయనగరం వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ పివిఎస్ఎస్‌కె పాత్రో అన్నారు. మండలంలోని పి.కోనవలసలో జిల్లేడు కషాయం తయారీని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కషాయాలను వినియోగించి వాటి ప్రయోజనాలను గ్రహించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారి కె.ప్రకాష్ మాట్లాడుతూ జిల్లేడు కషాయం పోషకాలమయమని, కావున రైతులంతా జిల్లేడు కషాయాన్ని తయారుచేసి ఎలాంటి ఖర్చు లేకుండా పంటలకు అన్ని రకాల పోషకాలను అందించేలా చూసుకోవాలని తెలిపారు. జిల్లేడులోని లేటెక్స్ అత్యంత పోషకాలతో కూడుకుందని, కావున రైతులు అన్ని పంటలపై పిచికారీ చేసుకోవాలని, దీని తయారీ కూడా చాలా సులువైందని తెలిపారు. కార్యక్రమంలో విఎఎ నాగమణి, ప్రకృతి సేద్య సిఆర్‌పి సురేష్, రైతులు పాల్గొన్నారు.